


***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే
## చివరి విడత: మలి సందడి (28)

బెర్లిన్ మిత్రులు ఎస్ ఎస్ రావు

ఏమనుకున్నా అన్నీ ఊహలే కదా! ఊహల్లోంచీ మా అసలు అడ్రసు దొరకదు.

రావుగారికేమో మా అడ్రసు పట్టుకుని పరిచయం చేసుకోవాలనుంది. కానీ ఎలా?

బాగా ఆలోచించి రావుగారు తనకు పరిచితులైన తెలుగువారికి నా పేరు చెప్పి వాకబు చెయ్యడం మొదలెట్టాడు.

నేనేమైనా పురప్రముఖుణ్ణా, ప్రముఖ భారతీయుణ్ణా – మామూలు డాడ్ స్కాలర్ని. ఐతే నేను డాడ్ స్కాలర్ని అన్న విషయం రావుగారికి తెలియదు. నా పేరు మాత్రం తెలుసు. ఆ ఆధారంతో గోదావరి ఈదడం మొదలెట్టాడు.

కలవారి కోడలు కలికి కామాక్షికి చెప్పినట్లు చాలామంది 'నేనెరుగ నేనెరుగ, ఫలానా వారినడుగు' అంటూ మరో పేరు సూచించడం – అతడు పట్టు వదలని విక్రమార్కుడిలా ఒకొక్కరినే అడుగుతూ అడుగుతూ వెళ్లడం.

చివరికాయనకి ఓ ఉత్తరాది మిత్రుడి ద్వారా నా ఆచూకీ తెలిసింది.

ఆ ఉత్తరాది మిత్రుడికి నా తోటి డాడ్ స్కాలరు గుప్తాతో పరిచయముంది. గుప్తా తరచుగా తన దగ్గర నా పేరు ప్రస్తావించేవాట్ట.

రావుగారికి నా చిరునామా తెలిసింది. నేను బెర్లిన్ వచ్చి ఎన్నాళ్లయిందో, ఏ సంస్థలో పని చేస్తున్నానో తెలిసింది.

రావుగారు స్వతహాగా మొహమాటస్థుడు. నేరుగా వచ్చి మమ్మల్ని మా ఇంట్లో కలుసుకుందుకు తటపటాయించాడు.

అదే తమిళులో బెంగాలీలో ఐతే అలా తటపటాయించరు. తమ భాష వాడు అని తెలియగానే ఎగురుకుంటూ వెడతారు.

తెలుగువాళ్లు ఇతర భాషలవారితో కలవడానికి చూపినంత ఉత్సాహం తమవాళ్లపట్ల చూపరు. కొత్తగా పరిచయమైనప్పుడు తెలుగువాడితో కూడా ఆంగ్లంలోనో, హిందీలోనో మాట్లాడతారు. ఇతర రాష్ట్రాల్లోనో, దేశాల్లో ఉన్నప్పుడు తమ పిల్లలకు తెలుగు నేర్పడానికి ప్రయత్నించరు సరికదా వాళ్లకు తెలుగు రాదని గొప్పగా చెప్పుకుంటారు. తాము కూడా తెలుగు మర్చిపోతున్నామని చెప్పడానికి తాపత్రయపడతారు. అంతా ఇలా కాకపోయినా ఎక్కువమందిది ఇదే తత్వం.

నేనా ఎక్కువమందిలో ఒకణ్ణని అనుకోను. కానీ తెలుగువాళ్లయినా సరే, కొత్తవాళ్లయితే చటుక్కున కలవడానికి తటపటాయించే స్వభావం నాకూ ఉంది.

కొబ్బరిచెట్టు ఎందుకెక్కావంటే దూడ గడ్డికోసమన్నాడని ఓ తెలుగు సామెత. నాకు పోస్టు కార్డు ఇవ్వడానికి ఇంత తతంగం అవసరమా అని నేననుకోవచ్చునని అతడి అనుమానం. తీరా కార్డు తీసుకున్నాక, 'ఇచ్చారుగా, థాంక్స్. ఇక వెళ్లండి' అన్నట్లు నేను ప్రవర్తించవచ్చునని ఇంకో అనుమానం. నన్ను అంచనా వెయ్యడానికి అతడు ముందుగా నాకు ఫోను చేశాడు.

ఆఫీసులో ఉండగా నాకు ఫోన్లు రావడం అరుదు. ఎప్పుడైనా ఓంప్రకాష్, గుప్తా వంటివారు చేస్తూంటారు కానీ మా ల్యాబులో బల్లమీద ఫోను మ్రోగినప్పుడు నేను ఫోను తియ్యను. ఎవరైనా తీసి, అది నాకైతే పిల్చి చెబుతారు. దగ్గర్లో ఎవరూ లేనప్పుడు మాత్రం, ఫోను తీస్తాను. ఎవరికొస్తే వాళ్లకి చెబుతాను.

రావుగారి ఫోను మ్యుల్లర్ తీశాడు. నన్ను పిలిచాడు.

అందుకుని, "హలో" అన్నాను.

"ఈజిట్ డాక్టర్ రాజగోపాలరావ్" అంది అవతలి గొంతు.

ఔనని, అవతల మాట్లాడుతున్నదెవరో తెలుసుకోగోరాను.

"అయాం ఎస్ ఎస్ రావు. కెమికల్ ఇంజనీర్, సీమెన్స్ కంపెనీ" అంది అవతలి గొంతు.

అపరిచితుడు. ఎందుకు ఫోన్ చేసేడా అనుకుంటూ, నా వివరాలు చెప్పి, ఆ ఫోను నాకోసమేనా అనడిగాను నిర్ధారణకోసం.

అతడు తన దగ్గరున్న నా కార్డు గురించి చెప్పి, అది నాకు అందజెయ్యడమెలాగా అనడిగాడు.

ఒక అపరిచితుడు నా ఉత్తరంమీద అంత శ్రద్ధ చూపడం విశేషంగా భావించి, "మా ఆఫీసుకొచ్చి ఇవ్వచ్చు. మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికొచ్చి కూడా ఇవ్వచ్చు" అన్నాను.

"మిమ్మల్నే మా ఇంటికి ఆహ్వానించొచ్చు కానీ, కార్డు నేను తెచ్చి మీకివ్వడం మర్యాద. ఇంటికొస్తే పరస్పరం పరిచయాలు కూడా ఔతాయి కదా! ఇట్ సే ప్లెజర్" అన్నాడతడు.

"థాంక్యూ – మాకైతే ఏ సాయంత్రమైనా ఫ్రీయే. మీ వీలు చెప్పండి" అన్నాను.

అతడు తన వివరాలు చెప్పాడు. అతడి భార్య కొన్నాళ్లు ఉద్యోగం చేసి మానేసింది. ఇద్దరు పిల్లలు. కొడుక్కి రెండు నిండడానికి నెల్లాళ్లు టైముంది. కూతురికింకా ఏడాది నిండలేదు. "ఐనా సాయంత్రాలు మాకు వీలే. మీరు మొహమాటపడకుండా మీ వీలు చెప్పండి" అన్నాడతడు.

నేను మా కుటుంబ వివరాలు చెప్పాను.

అతడు వెంటనే, "డాడ్ స్కాలర్సు అంటే 30కి కాస్త అటూ ఇటూ ఉంటారని తెలుసు. అలా నేను మీకు వయసులో కనీసం పదేళ్లు సీనియర్ని. బెర్లిన్ నివాసిగా కూడా నేను మీకు బాగా సీనియర్ని. ఐతే పిల్లల విషయంలో మాత్రం మీరే నాకు సీనియర్. మన పరిచయంలో ఒకరి సీనియారిటీ ఒకరికి బాగా పనికొస్తుందని నా ఆశ" అన్నాడు.

అంతవరకూ మా సంభాషణ ఆంగ్లంలోనే కొనసాగింది.

రావుగారు తెలుగువాడు. నేను తెలుగువాణ్ణని తెలుసు. ఐనా తెలుగులో కాక ఆంగ్లంలో పలకరించి, సంభాషణని ఆంగ్లంలోనే కొనసాగిస్తున్న అతడు ఎలాంటి తెలుగువాడో, ఆ పరిచయం ఉభయులకీ ఎలా ఉపయోగపడుతుందో ననిపించింది.

"మరి నీ సంగతేమిటి? అతడూ నీ గురించి ఇలాగే అనుకుంటున్నాడేమో" అంది మనసు.

"కానీ ముందు మాట్లాడింది తను. తనే తెలుగులోకి దిగిపోవచ్చుగా" అనుకున్నాను.

తెలుగువారిలో ఉండే ఈ తటపటాయింపుకి కారణం – అప్పుడర్థమయింది నాకు. మనం మనకంటే ఎక్కువగా అవతలవారి గురించి ఆలోచిస్తాం. మనని మనం విశ్లేషించుకుంటే – పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలన్న సమస్య ఉండదు. అప్పుడు మనం ఊహించని కొత్త వ్యక్తిత్వాలు బయటపడతాయి.

ఇలా అనుకుని తటపటాయిస్తూనే, "మనం మాట్లాడుకుందుకు తెలుగులో మీకు ఫ్రీగానే ఉంటుందా?" అన్నాను.

అంతే, అతడి స్వరం ఒక్కసారిగా మారిపోయింది, "తెలుగు ఫ్రీగా ఉంటుందా అని నన్నా అడుగుతున్నారు? నేనెవరనుకుంటున్నారు? మాది తూర్పు గోదావరి. నేను అమలాపురంవాణ్ణి" అన్నాడు అక్కడి అసలైన యాసలో.

ఆ భాష, యాస వినగానే ప్రాణం లేచొచ్చింది. అతడు మాట్లాడిన తీరులో ఆత్మీయత ధ్వనించింది. తెలుగుతనానికి గర్వపడే ధ్వని ఆ గొంతుకి మరింత శోభనిచ్చింది.

సుమారు పావు గంట సేపు ఏవేవో మాట్లాడుకున్నాం.

కలుసుకుందుకు సమయం నిర్ధారించుకున్నాం. భోజనానికి రావాలంటే, సంకోచించకుండా ఒప్పుకున్నాడాయన.

రావుగారి పరిచయం బెర్లిన్లో మాకు ఎన్నో మరపురాని అనుభూతులనిచ్చింది. అవి మేము మా ఇంట్లో కలుసుకున్న మొదటిరోజునించే మొదలయ్యాయి.

ఆరోజు శ్రీమతి తెలుగువారికి అపురూపమైన వంకాయకూర, బంగాళాదుంపల వేపుడు, కొబ్బరిపచ్చడి, మెంతిమజ్జిగ చేసింది. సుందరం కోసం పెట్టిన దోసావకాయ ఉండనే ఉంది.

రావుగారు ఏడున్నరకి వస్తానన్నారు. నేను 7.20కల్లా మెట్లు దిగి కిందకి వెళ్లాను. మరో ఐదు నిముషాల్లో మా భవనం ముందున్న ఓ చెట్టుకింద, ఫుట్‌పాత్‌మీద కారు ఆగింది. రావుగారు, ఆయన శ్రీమతి సత్యవతి, కుమారుడు కారు దిగారు. ఆమె చేతిలో పిల్లల సంరక్షణకు సంబంధించిన సరంజామా కోసం ఓ బ్యాగుంది. రావుగారి చేతిలో కాస్త పెద్ద సైజు ఫిడేలు పట్టే ఓ పెట్టె ఉంది.

పరస్పర పరిచయాలయ్యేక నేను వాళ్లకి దారి చూపించాను. మెట్లెక్కి రెండో అంతస్తు చేరుకున్నాక – రావు గారు చటుక్కున ఓ అడుగు ముందుకేసి తలుపు దగ్గరకెళ్లి అటూ ఇటూ చూసి, “పాతకాలపు ఇల్లు కదా, కాలింగ్ బెల్ ఉన్నట్లు లేదు” అన్నాడు.

నేను నవ్వి తలుపు దగ్గరకెళ్లి, తలుపుకున్న అండాకారపు ఇత్తడి పిడిని పట్టుకుని పైకెత్తాను.

రావుగారికి అర్థమైంది, “ఇన్నేళ్లుగా ఇక్కడుంటున్నాను కానీ ఇలాంటి కాలింగ్ బెల్ చూడలేదు. మీ పరిచయంలో అప్పుడే ఓ కొత్త విశేషం” అని నవ్వారు.

తలుపు తెరుచుకుంది. గుమ్మం దగ్గరే పరిచయాలు కావలసింది కానీ, రావుగారు అందుకు సుముఖంగా కనబడలేదు.

ఇండియాలోలా అలా గుమ్మాల దగ్గర నిలబడి ఎక్కువసేపు మాట్లాడితే ఇక్కడ ఇరుగుపొరుగులు ఇష్టపడరు. మాకా విషయం తెలుసు కానీ, ఇంతవరకూ అనుభవంలోకి రాక, గుర్తుండదు. జర్మనీలో నాకు బాగా సీనియర్ కదా — రావుగారికి ఈ అలవాటు వంట బట్టేసి ఉంటుందని అర్థం చేసుకున్న శ్రీమతి చిరునవ్వునే పలకరింపు చేసి, పక్కకు తప్పుకుని దారిచ్చింది.

అంతా మా ఇంట్లోకి వెళ్లేక, పరస్పర పరిచయాలయ్యాయి. ఆ దంపతులు స్నేహపాత్రులు కావడంతో, కొద్ది నిముషాల్లోనే బాగా పరిచయమున్నవాళ్లలా మాట్లాడుకోసాగాం.

రావుగారబ్బాయి, మా పిల్లలతో కలిసిపోయాడు.

మా పాపకి పెద్దరికం చూపడం ఇష్టం. ఏణ్ణర్థమే చిన్న అయిన తమ్ముడిమీద అది అథార్టీ చేస్తూనే ఉంటుంది. ఈరోజు దానికి అదనంగా ఇంకో బాబు దొరికాడు.

అక్కలాగే పెత్తనం చెలాయించాలని మా బాబుకీ సరదా ఉంది. కానీ తను పెద్దదాన్నని దబాయించి సాగనివ్వదు మా పాప. అమాయకుడు — ఏదో రోజున తను దానికంటే పెద్ద ఔతానని ఆశగా ఎదురుచూస్తూ, అందాకా సరిపెట్టుకుంటున్నాడు వాడు. ఈరోజు వాడికి తనకంటే చిన్నవాడొకడు దొరికాడు.

సాధారణంగా చిన్నపిల్లలు తమకంటే కొంచెం పెద్ద వయసు పిల్లలతో ఆడుకోవాలని సరదా పడతారు. రావుగారబ్బాయికి ఈరోజు ఆ సరదా తీరింది.

వాళ్లు ముగ్గురూ కూడా మమ్మల్ని మరిచి వేరే ప్రపంచంలోకి వెళ్లిపోయారు.

పది నిముషాలు కబుర్లయ్యేక, శ్రీమతి భోజనాలకు ఏర్పాటు చేస్తానంది.

“ఐతే ముందు పాపకు అన్నం పెట్టేద్దాం” అంది రావుగారి భార్య సత్యవతి.

“పాప ఎక్కడ?” అని శ్రీమతి ఆశ్చర్యంగా అడిగింది. అంతలోనే రావుగారు తన ఫిడేలు పెట్టెలోంచి పాపని బయటకు తీశారు.

పాప చూడ్డానికి బక్కగా, 3–4 నెలల పిల్లలా ఉంది. రావుగారు పెట్టెలోంచి బయటకి తియ్యగానే ఒక్కసారి పసిపిల్లలకే సాధ్యం అనిపించేటంత ముద్దుగా వళ్లు విరుచుకుంది. అప్పుడే నిద్ర లేచిందేమో ఓసారి కళ్లు చిట్లించి చుట్టూ చూసింది.

కొత్త చోటు కదా, ఏడుస్తుందనుకున్నాను కానీ – ఆసక్తిగా పరిసరాల్ని పరిశీలిస్తోంది.

“పాప ఈ పెట్టెలో ఉందా? తనని ఎందుకు తీసుకురాలేదా అని ఇందాకట్నుంచి అడగలేక మనసులో సతమతమౌతున్నాను” అన్నాను.

అది పిల్లలకోసం అక్కడ వాడే కారీబాగ్ అని తెలిసి, ఇదేదో తమాషాగా బాగుందే, అనుకున్నాను.

“పిల్లల్ని అలా వదిలేసేది ఇక్కడివాళ్లు. మనమలా ఉండలేం కదా” అంది సత్యవతి.

“ఔను” అనె వెంటనే తలాడించి, “పాపకోసమని కొద్దిగా పప్పు పడేశాను. నెయ్యి కూడా ఉంది” అంది శ్రీమతి.

కానీ సత్యవతి పిల్లకోసం భోజనం తయారు చేసి కూడా తెచ్చుకుంది.

“ఏమనుకోకండి. ఇది చూడ్డానికే కాదు, అరాయించుకుందుకూ అర్భకురాలు. ఆ మధ్యనే విరేచనాలు పట్టుకుని పిల్ల మనకి దక్కుతుందా అనుకునేదాకా వచ్చింది” అంది సత్యవతి.

రావుగారు నవ్వి, “అంతేం లేదు కానీ, మా ఆవిడే కంగారు పడి, తనే నాకు దక్కుతుందా అనుకునే దాకా వచ్చింది” అన్నారు.

“అనడానికేం? పిల్లలకోసం అమ్మ ప్రాణాలు అలాగే తపించిపోతాయి మరి. ఇండియాలో ఉన్నప్పుడు మీకు రొంపపడితే చాలు, మీ అమ్మగారు చేసే హడావుడి మర్చిపోయారా?” అంది సత్యవతి.

అది కోపం కాదు, ఉక్రోషం కాదు.

దంపతుల్లో ఒకొక్కరిది ఒకోరకం. భార్యాభర్తలు ఒకరిమీద ఒకరు విసుర్లేసుకుని వినోదించడం అదో ముచ్చట. ఇంకా చెప్పాలంటే అన్యోన్యతకి అదో పరాకాష్ఠ.

భవనేశ్వర్లో మా కాలనీలో అలాంటి జంటలు కనీసం మూడుండేవి. వాళ్ల మాటలు వినముచ్చటగా ఉండేవి.

సత్యవతి పాపకి అన్నం పెడుతుంటే రావుగారు చెప్పాడు.

పాపకి విరేచనాలు వెళ్లినప్పుడు హాస్పిటలుకి తీసుకెడితే వాళ్లు పాపని అక్కడ వదిలేసి, తల్లిని కూడా ఇంటికి వెళ్లిపొమ్మన్నారుట. తను లేకుండా పాప క్షణం కూడా ఉండలేనని ఆమె కళ్లనీళ్ల పర్యంతమైనా ససేమిరా అన్నారుట.

ఇంటికొచ్చి ఆమె పాపను తల్చుకుని అదేపనిగా ఏడుపుట.

“అనారోగ్యంతో ఉన్నా పాపకి హాస్పిటల్లో అవసరమైన అటెన్షన్ దొరికి సుఖంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్న బాబుని ఇంట్లో ఉండీ తల్లి కూడా పట్టించుకోలేదు” అన్నాడు రావుగారు.

“మీరే చెప్పండి. తల్లి పక్కన లేకుండా ఏ చంటిపిల్లయినా సంతోషంగా ఉంటుందా? ఐనా ఇదేం చోద్యం? వీళ్లకి అనుబంధాలు తెలియవు. యాంత్రికంగా నియమాలు అనుసరించడమే. వచ్చి వచ్చి ఇలాంటి దేశంలో పడ్డాం” అంది సత్యవతి.

“వాళ్లకి పిల్ల ఆరోగ్యం ప్రధానం. పిల్లకు చికిత్స ప్రధానం. రెండు వారాలు మన దగ్గర లేకపోతేనేం – వాళ్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకుని మన పిల్లని మామూలు మనిషిని చేసి కదా మనకి అప్పగించారు” అన్నాడు రావుగారు.

“ఇప్పుడిలా గంటున్నారా, అప్పుడేమో – ‘చంటి పిల్లలకి విరేచనాలు వెడితే అదో పెద్ద జబ్బా? దానికే పిల్లని తలిదండ్రులనుంచి వేరు చెయ్యాలా?’ అని తనే రోజూ గోల పెట్టేవారు. ఐనా ఒకటి మాత్రం నిజం. ఇలాంటప్పుడు పిల్లల్ని ఆస్పత్రిలో ఉంచడమే మంచిది. మనం తింటున్నదేమైనా పిల్లలకి పెట్టాలనిపిస్తుంది. ఎంత చెప్పినా ఏదో బలహీనత జాగ్రత్తల్ని అధిగమించేలా చేస్తుంది” అంది సత్యవతి.

"చిన్న కరెక్షన్. ఇది మన దేశంలో ఆస్పత్రులకి వర్తించదు. ఇక్కడ రోగిని కాపాడ్డంకోసం, అయినవాళ్లకంటే డాక్టర్లే ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు. అక్కడ ఆస్పత్రికి వెళ్లడమంటే అంతిమయాత్రే! అందుకే మా అమ్మెప్పుడూ నాకు గృహవైద్యమే చేసేది" అన్నారు రావుగారు.

గత సంవత్సరం జర్మన్ భాష నేర్చుకుంటున్నప్పుడు, ల్యానబర్గులో నేను చూసిన క్రంకెన్ హౌస్ (హాస్పిటల్) గుర్తొచ్చింది. అందులో మిసమిసలాడే అందాల పసిపాపలు ఇప్పటికీ తలచుకున్నపుడల్లా కళ్లముందు కదలాడతారు. ఆటబొమ్మలు, ఆహారం వగైరా సదుపాయాలున్నా అయినవాళ్లు పక్కనలేక – అదోలా కనిపించే వాళ్ల ముఖాల్ని నేనెప్పుడూ మర్చిపోలేను. ఇప్పుడు వాళ్లమధ్య రావుగారి పాపని ఊహించుకుంటే ఒక్కసారి వళ్లు జలదరించింది.

ఐతే రావు దంపతుల సంభాషణ ఎక్కడ మొదలైంది? ఎక్కడ తేలింది?

అనుబంధాల విషయంలో మన ఔన్నత్యంతో మొదలెట్టి, చివరికి ఇక్కడి ఆస్పత్రుల ఔన్నత్యం దగ్గర తేలారు!

చెప్పాలంటే వాళ్లన్నవాటిలో ఏదీ అబద్ధం కాదు. వాళ్ల మాటల్లో రెండు విభిన్న వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. రెండు వ్యవస్థల్నీ బాగా దగ్గర్నుంచి చూసిన వాళ్లు – ఏ వ్యవస్థ ఎక్కువ మంచిదో తేల్చలేకపోయారు.

అందుకేనేమో, ఈ దంపతులు అపూర్వమైనవారనీ, వీరినుంచి చాలా నేర్చుకునే అవకాశం ఉన్నదనీ అప్పుడే అనిపించింది నాకు.

పాప భోంచేసేక బుద్ధిగా పడుకుంది. "ఇంట్లో ఐతే గదంతా చీకటి చేస్తేనే కానీ పడుకోదు. మీ ఇంట్లో దానికి ప్రశాంతంగా ఉన్నట్లుంది. హాయిగా పడుకుంది" అంది సత్యవతి.

అదో మర్యాద. నిజమనుకోకూడదని తెలుసు. చిన్నగా నవ్వి, "గదంతా చీకటి చేసి మరి అంతా ఒక్కసారే పడుకుంటారా? మరి బాబు మెలకువగా ఉంటే గొడవ చెయ్యడా?" అన్నాను.

"ఆ సమస్యే లేదు. బాబు గది వేరు. పాప గది వేరు. మా గది వేరు. ఎవరి గదుల్లో వాళ్లుంటాం" అంది సత్యవతి.

"చంటిపిల్లకి తల్లి పక్క కావాలి కదా, వేరే గదిలో పడుకోబెడితే, ఇక ఆస్పత్రికీ, ఇంటికీ తేడా ఏమిటి?" అంది శ్రీమతి అప్రయత్నంగా.

"తేడా లేకేం? అక్కడ పాప కుంయ్‌మంటే నర్సులు పరుగెడతారు. ఇక్కడ అమ్మ పరుగెడుతుంది" నవ్వారు రావుగారు.

"తేడా ఉందంటూనే మీరన్నది తేడా లేనట్లే ఉంది. ఆవిడకి అర్థమయ్యేలా నేను చెబుతాను, ఉండండి" అంది సత్యవతి.

ఇక్కడ దంపతులు మాత్రమే ఒకే గదిలో ఉండొచ్చు. పిల్లలు ఎంతమందుంటే అంతమందికీ తలో గదీ ఉండాలని సాంఘిక నియమం. ఇక్కడున్నప్పుడు వీళ్ల నియమాల్ని గౌరవించాలి, పాటించాలి. అది అనుకున్నంత కష్టమేం కాదు. విడిగా పడుకోబెట్టడంవల్ల పిల్లలకు ఆహారం, నిద్ర వగైరాల్లో క్రమశిక్షణ ఏర్పడుతుంది. పద్ధతులు అలవాటౌతాయి. ఆపైన బడిలో వేసినప్పుడు, అమ్మను విడిచి ఉండడం కష్టం అనిపించదు.

ఆమె చెబుతుంటే కళ్లలో మెరుపు. ఇక్కడి ఈ పద్ధతి ఆమెకు నచ్చినట్లే ఉంది.

శ్రీమతి వైపు చూస్తే – రాత్రిపూట చంటిదైన కన్నబిడ్డను గుండెలకు హత్తుకుని పడుకోవడంలో ఉన్న ఆనందం మిస్ కాతగ్గదేనా అన్న భావం – ఆమె కళ్లలో కనిపించింది. కానీ పైకి అనలేదు.

మా పిల్లలు చిన్నప్పట్నించి ఇప్పటిదాకా రాత్రిళ్లు మా పక్కనే పడుకుంటున్నారు. వాళ్లు లేకపోతే ఏదో మిస్సయినట్లే ఉంది. భోజనం, నిద్ర వగైరాల్లో వాళ్ల క్రమశిక్షణను చాలామంది మెచ్చుకునేవారు. ఎటొచ్చీ మన దేశంలో అందరు పిల్లలూ అలా ఉండరు. ఇక్కడి పిల్లలు అంతా అలాగే ఉంటారేమో!

పాప పడుకున్నాక మిగతా భోజనానికి మిగతా పిల్లలు ముగ్గురి వంతూ వచ్చింది. మా బాబు తను బుద్ధిగా భోంచేస్తుంటే, రావుగారు, "మీవాడు చాలా బుద్ధిమంతుడు" అని మెచ్చుకున్నాడు.

ఆ మాటకి మా పాప మొహంలో కలవరం చూశాను. అది బాబులా స్పీడుగా తినలేదు. ఇప్పుడు తనకీ వాడికీ పోలికొస్తుందేమోనని దాని భయం. అందుకని ఓ క్షణం ఆలోచించి, "ఆంటీ, మీ బాబుకి నేను తినిపించొచ్చా?" అనడిగింది.

అప్పటికి సత్యవతి బాబుచేత అన్నం తినిపించడానికి కొంచెం అవస్థ పడుతోంది.

"చిన్నపిల్లవి, నావల్లే కానిది నీవల్లనౌతుందా?" అందామె.

పాప ఏదో అనేలోగానే వాళ్ల బాబు, "అక్కే నాకు తినిపించాలి" అని మారాం మొదలెట్టాడు.

"సరే కానీ, అక్కని ఏడిపించకూడదు. ఏడిపించావో, మళ్లీ నేనే నీకు తినిపిస్తాను" అంది సత్యవతి.

ఇదంతా చూస్తుంటే, నాకు బెర్లిన్లో ఉన్న భావన పోయి, భువనేశ్వర్లో మా కాలనీలో ఉన్న అనుభూతి కలిగింది. ఆ అనుభూతి ఎంతో ఆహ్లాదంగా ఉంది. ఇలాంటి మిత్రులుంటే, ఎక్కడున్నా మనవాళ్లమధ్యనే ఉన్నట్లు ఉంటుందనిపించింది.

మా పాపకి ఇదో కొత్త అవకాశం. వాళ్ల బాబుకేమో ఓ కొత్త అనుభవం. ఆ రెండూ కలిసి మిషన్ జయప్రదమైంది. క్షణాల్లో బాబు భోజనం ఐపోయింది.

"రోజూ తినడానికి ఎంత ఏడిపిస్తాడు? వీడికి నీ వంటకంటే ఆంటీ వంటలు ఎక్కువ నచ్చినట్లున్నాయి. ఇకమీదట రోజూ కార్లో వీళ్లింటికొచ్చి వీడికోసం లంచ్ బాక్స్ కలెక్ట్ చేసుకుంటాను" అన్నాడు రావుగారు.

"లంచ్ బాక్సొక్కటీ చాలదు. పాపని కూడా తీసుకురావాలి. బాబు తను పెడితేనే తింటాడు కాబట్టి పాపని మనింట్లోనే ఉంచేసుకుందాం" అని, "ఏం పాపా, మా ఇంటికొచ్చి ఉంటావా? నిన్ను మీ అమ్మానాన్నలంత బాగానూ చూసుకుంటాం" అంది సత్యవతి .

పాప కలవరపడుతుందనుకున్నను. కానీ ఆ క్షణంలో తనకు లభించిన ప్రాధాన్యానికీ, మెప్పుకీ గొప్పగా మొహం పెట్టి, "మరి నాకోసం మీ ఇంట్లో ఇంకో గది ఉందా?" అనడిగింది.

నేను, శ్రీమతి తెల్లబోయాం. రావుగారు అప్రయత్నంగా మా పాపని దగ్గరగా తీసుకుని, "భలే అడిగావమ్మా, ఇంతవరకూ మమ్మల్ని ఇలా అడిగినవారు లేరు" అన్నారు.

"ఈ తరం పిల్లల తెలివే తెలివి. మన మాటలన్నీ పాపకి బాగా అర్థమౌతున్నాయి. మనం కాస్త చూసుకుని మాట్లాడాలి" అంది సత్యవతి స్వరం కాస్త తగ్గించి.

పాప మొహంలో గర్వం కనబడింది. "భువనేశ్వర్లోనూ నా గురించి ఇలాగే అనేవారు అంకుల్సు" అంది.

అంతా నవ్వుకున్నాం. అంతలో రావుగారి బాబు మత్తుతో జోగసాగాడు. అతణ్ణి మంచంమీద పడుకోబెట్టేం.

"పాప కూడా తినేసేక మనం భోజనాలకి కూర్చుందాం" అంది సత్యవతి.

పాప తల అడ్డంగా ఊపి, "నేనూ పెద్దదాన్నే, మీతోనే తింటాను" అంది.

శ్రీమతి మందలించబోయింది కానీ, సత్యవతి దాని మాటలకి ముచ్చటపడి సరేనంది.

అక్క భోజనానికి కూర్చుంటే తమ్ముడు ఓ మూలకి వెళ్లి జిగ్‌సా పజిల్ తీసుకున్నాడు. అక్క పక్కన లేకుండా తనకి తానుగా బొమ్మను కూర్చాలని వాడి కోరిక. ఇద్దరికీ వేర్వేరు పజిల్సున్నా మా పాప తన బొమ్మ తాను తయారు చేసేసేక, వద్దంటున్నా వినకుండా వాడికి సాయం చేస్తుంది. అందుకని వాడు ఇప్పుడా కోరిక తీర్చుకుంటున్నాడు.

మా భోజనాలు మొదలయ్యాయి. ఐటమ్సుని వాళ్లు మెచ్చుకోవడం వగైరాలు మామూలే కానీ, దోసావకాయకి సుందరంలాగే వాళ్లూ ఆశ్చర్యపడ్డారు.

"కుకుంబర్ వాడి మేమూ దోసావకాయ పెడుతుంటాం. కానీ ఇది నిజంగా దోసకాయతో పెట్టినది. ఇన్నేళ్లుగా ఒక్కసారి కూడా మా కంటబడని దోసకాయ మీకు ఎక్కడ దొరికింది? ఎలా దొరికింది?" అనడిగాడు రావుగారు.

"ఇక్కడ ఇది ఇంత స్పెషల్ అని నాకు తెలియదు. ఓసారి సంతలో కనబడింది. కొన్నాను. అంతే!" అన్నాను ఆశ్చర్యంగా. ఏదేమైనా అతిథులకు సంభ్రమానందాశ్చర్యాల్ని కలిగించిన ఆ దోసకాయ ఒక్కసారైనా నాకు దొరకడం అదృష్టమనుకున్నాను.

భోంచేస్తూ కబుర్లలో రావుగారు నా అడ్రసు పట్టుకుందుకు తను చేసిన కృషిని తనదైన శైలిలో వివరించాడు.

"వింటుంటే అనిపిస్తోంది – నేను మా ఆవిణ్ణిక్కడికి తీసుకురావడానికి పడ్డ శ్రమకీ, మానసిక ఒత్తిడికీ — మీ శ్రమ ఏమాత్రం తీసిపోదని" అంటూ వాళ్లకి ఆ వివరాలు చెప్పాను.

ఆ దంపతులు శ్రద్ధగా నేను చెప్పింది విన్నారు. తర్వాత రావుగారు మాతో, "మీరిద్దరూ కూడా మా ఇద్దరికంటే బాగా చిన్నవాళ్లు. కాబట్టి చొరవ చేసి ఓ మాట చెప్పనా?" అన్నాడు.

ఉన్నట్లుండి అతడలా అనేసరికి ఆశ్చర్యమేసి, "మిమ్మల్ని పెద్దవాళ్లని మేమనుకోవడంలేదు. మనమంతా ఓ తోటివాళ్లం. ఐనా మీరేం చెప్పదల్చుకున్నా నిస్సంకోచంగా చెప్పొచ్చు" అన్నాను.

"నేను మీకంటే పదేళ్లకు పైగా పెద్దవాణ్ణి. మా ఆవిడక్కోపమొచ్చినా సరే, తనూ మీ అవిడకంటే పదేళ్లకు పైనే పెద్దది. ఉన్నమాటనడానికి సంకోచమెందుకూ, మా ఇద్దరికీ కూడా లేట్ మారేజ్" అన్నాడు రావుగారు.

ఆ మాటలు కొంచెం ఇబ్బందిగా అనిపించి, "మీది లేట్ మారేజని నాకనిపించదు. లవ్ మారేజి అనిపిస్తుంది" అన్నాను వెంటనే.

"మాది లవ్ మారేజ్ కాదు కానీ మారేజ్ లవ్. అంటే పెళ్లి చేసుకున్నాక ప్రేమ అన్న మాట. పెళ్లికిముందు ప్రేమ పెళ్లితో పోతుంది. పెళ్లి తర్వాత ప్రేమకి ఎక్కడికైనా పోవాలన్నా వేరే దారుండదు" అన్నాడు రావుగారు.

సత్యవతికి మొహమాటమేసిందేమో, "వాళ్లకి ఏదో మాట చెబుతానన్నారు...." అంటూ సంభాషణ దారి మళ్లించింది.

"చెప్పేముందు పెద్దరికాన్ని ఎస్టాబ్లిష్ చేసుకోవాలిగా, అదయింది కాబట్టి ఇక చెబుతాను" అంటూ మావైపు తిరిగి, "పెద్దవాణ్ణి చెబుతున్నాను. నా మాటని తేలిగ్గా తీసుకోకండి. ఇకమీదట మీకు ఎలాంటి విషమస్థితి ఎదురైనా ఏమాత్రం కలవరపడొద్దు. టెన్షన్ ఫీలవద్దు. భగవాన్ సత్యసాయిబాబాని మనసులో తల్చుకోండి. అన్నీ ఆయనే చూసుకుంటాడు" అన్నాడు రావుగారు.

ఉలిక్కిపడ్డాను. నేను నాస్తికుణ్ణి కాదు కానీ, నలుగురూ నమ్మే పద్ధతిలో దేవుణ్ణి నమ్మను. మా దగ్గరి బంధువుల్లో కొందరు నన్ను నాస్తికుడని కూడా అనుకుంటారు. ఇక సత్యసాయిబాబా విషయానికొస్తే ఆయన దేవుడని నేనెప్పుడూ అనుకోలేదు. ఇంకా చెప్పాలంటే, నాకు తెలిసిన కొన్ని ఇతర విశేషాల్ని బట్టి ఆయనపై సదభిప్రాయం కూడా లేదు.

రావుగార్ని చూస్తే ఏదో సరదాకి అన్నట్లు లేదు. బాబాగారి వీరభక్తుడిలా అనిపించారు. ఇంకా చెప్పాలంటే బాబాగారే వెదుక్కుంటూ బెర్లిన్ వచ్చి రావుగారి రూపంలో నన్ను కలిశారా అనిపించింది.

ఇప్పుడు నేను రావుగారికి ఏం చెప్పాలి?

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments